RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:66 | ఫిబ్రవరి 17, 2026 | వెల: రూ.3-00

దినపత్రిక

## గచ్చిబౌలిలో డ్రగ్స్ ముఠా అరెస్ట్


- అదుపులో వ్యాపారులు, విద్యార్థి సహా ముగ్గురు
- 15 గ్రాముల కొకైన్ స్వాధీనం



2లో

# ముగిసిన కుర్చీలాట!

### కొలువుదీరిన పుర, నగర పాలకవర్గాలు వ్యూహ ప్రతివ్యూహాలతో పంతం నెగ్గించుకున్న పార్టీలు



2లో

- 7 కార్పొరేషన్లలో 5 చోట్ల రెపరెపలాడిన కాంగ్రెస్ జెండా
- కరీంనగర్‌లో 'కమలం'.. కొత్తగూడెంలో 'సీపీఐ'
- ఆదిలాబాద్‌లో బీజేపీకి మెజారిటీ ఉన్నా కాంగ్రెస్‌కే మేయర్ పీఠం
- 11 చోట్ల ప్రక్రియ వాయిదా.. నేడు ఎన్నిక
- జనగామలో 'కింగ్‌మేకర్ల'గా మారిన స్వతంత్రులు
- పదవుల కోసం చేతులు కలిపిన బద్ధ శత్రువులు
- పురపోరు సమాప్తం.. పట్టణాల్లో నయా పాలన ప్రారంభం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ పురపాలక పీఠాలపై ఉత్కంఠకు తెరపడింది. ఎత్తులకు పైఎత్తులు, ఊహించని పొత్తులు, వ్యూహ ప్రతివ్యూహాల మధ్య రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. పదవి దక్కించుకోవడమే పరమావధిగా.. సిద్ధాంతాలను పక్కనబెట్టి, పగలు ప్రతీకారాలను మర్చిపోయి బద్ధశత్రువులు సైతం దోస్తీ కట్టిన నాటకీయ పరిణామాలకు ఈ ఎన్నికలు వేదికయ్యాయి. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లలో ఐదింటిని కైవసం చేసుకుని కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని చాటుకోగా, కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ జెండా ఎగురవేశాయి. మరోవైపు జనగామ వంటి చోట్ల బలాబలాలు సమం కావడంతో స్వతంత్రులు కింగ్ మేకర్లుగా మారగా, ఉద్రిక్తతల మధ్య 11 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మలుపులు, సస్పెన్స్‌ల మధ్య కొలువుదీరిన ఈ నూతన పాలకవర్గాలతో పట్టణ పాలనలో సరికొత్త అధ్యాయం మొదలైంది.



2లో

## ప్రభుత్వం గూండాలా వ్యవహరిస్తోంది

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు
- అభ్యర్థుల కిడ్నాప్ ప్రయత్నాలు, దాడులు, బెదిరింపులు
- ప్రజాతీర్పును అగౌరపర్చింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- డీజీపీ, ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని డిమాండ్



2లో

## పదవులు శాశ్వతం కాదు

- మునుగోడు అభివృద్ధే లక్ష్యం
- మంత్రి పదవిపై కోమటిరెడ్డి రెడ్డి వ్యాఖ్యలు

## పాత గ్రామాలపై కబ్జాదారుల పడగ

- ప్రభుత్వ ఆస్తులకు పొంచి ఉన్న ముప్పు
- రెవెన్యూ రికార్డులనూ లెక్క చేయని అక్రమార్కులు
- నిమ్మకు నీరెత్తినట్లుగా రెవెన్యూ యంత్రాంగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ వేడుకోలు

**వేద న్యూస్, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం పరిధిలోని మిడ్ మానేర్ రిజర్వాయర్ ఇప్పుడు భూబకాసురులకు కాసుల కురిపించే గనిలా మారింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో సేకరించిన విలువైన భూములు, ముంపునకు గురైన పాత గ్రామాల ఆస్తులు ఇప్పుడు అక్రమార్కుల చేతుల్లో చిక్కుకుంటున్నాయి. నిర్వాసితులకు పరిహారం చెల్లించి, ప్రభుత్వం చట్టబద్ధంగా స్వాధీనం చేసుకున్న భూములను సైతం కబ్జాదారులు మళ్లీ తమ ఆధీనంలోకి తెచ్చుకుంటూ బహిరంగంగానే పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారుల వద్ద రికార్డులు ఉన్నా, క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనీ స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో.. కబ్జాదారులు సామాన్యులను బెదిరిస్తూ రెచ్చిపోతున్నారు.

## మిడ్ మానేర్ పరిధిలో భూ మాయ!



2లో

## నరకప్రాయం.. ఎంజీఎం

### అస్తవ్యస్తంగా ఆస్పత్రి నిర్వహణ


- పనిచేయని నెబ్యులైజేషన్ మిషన్లు
- ఉన్నవి మూడు.. అందులో పనిచేయనివి రెండు
- వైద్యం కోసం వస్తే రోగం ముదిరే పరిస్థితి
- ఒక్క బెడ్ పై ముగ్గురు రోగులు
- పట్టించుకోని పాలకులు



2లో

## వరి రైతులకు రూ.514.36 కోట్లు విడుదల

- బోనస్ బకాయిలు రిలీజ్ చేసిన రేవంత్ ప్రభుత్వం
- 2.17 లక్షల మంది రైతులకు లాభం



2లో

వేద న్యూస్



## ప్రభుత్వం గూండాలా వ్యవహరిస్తోంది

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలోని పలు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన ప్రభుత్వం, పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని గూండాల మాదిరిగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేసి పదవులు పొందేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని విమర్శించారు. తొర్రూరు, జనగామ, క్యాతనపల్లి, కాగజ్‌నగర్ తదితర పట్టణాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, గెలిచిన ప్రజా ప్రతినిధులను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నాలు, దాడులు, బెదిరింపులు జరగడం రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో సూచిస్తున్నాయని అన్నారు. పలు చోట్ల మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ అనుచరులు దాడులు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఒత్తిడితో కోరం ఉన్నప్పటికీ ఎన్నికలను వాయిదా వేయడం ఎన్నికల ప్రక్రియను అవమానపరిచే చర్య అని పేర్కొన్నారు.

## పదవులు శాశ్వతం కాదు..

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, తన నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోయినా పరవాలేదని, మునుగోడు అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తే చాలని అన్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. తనకు మంత్రి పదవి ఇవ్వాలనే హామీతోనే తాను పార్టీలోకి వచ్చానని, మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని గతంలో వెల్లడించారు. లేకపోతే ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తానని కూడా వ్యాఖ్యానించారు. మళ్లీ అడగబోనని, కానీ తనకూ ఒకరోజు వస్తుందని, ఆ రోజు పదవి లాక్కుంటానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఒక్క ముఖ్యమంత్రి మాత్రమే కష్టపడలేదని, పార్టీలోని ప్రతి నాయకుడు శ్రమించారని ఆయన అభిప్రాయపడ్డారు.

## వరి రైతులకు బోనస్ బకాయిల విడుదల

**రూ.514.36 కోట్లు రిలీజ్ చేసిన రేవంత్ ప్రభుత్వం**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

వరి రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. పెండింగ్‌లో ఉన్న వరి బోనస్ బకాయిలుగా రూ.514.36 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో సుమారు 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులకు ఈ బోనస్ వర్తించనుంది. కనీస మద్దతు ధరకు అదనంగా ఈ రూ.500 చెల్లింపులు జరుగుతున్నాయి. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, రైతులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. బకాయిల విడుదలతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## గచ్చిబౌలిలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

గచ్చిబౌలిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను ఈగల్ బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో ఇద్దరు వ్యాపారులు, ఒక విద్యార్థి సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 15 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మురళీకృష్ణంరాజుతో పాటు వ్యాపారవేత్తలు చిరంజీవి వర్మ, హేమంతరాజును అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నైజీరియా దేశస్థుల నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ముఠా నగరంలోని సుమారు 15 మంది ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం. డ్రగ్స్‌ను చాక్లెట్ గిఫ్ట్ ప్యాకుల్లా తయారు చేసి ర్యాపిడో సేవల ద్వారా డెలివరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# నరకప్రాయం.. ఎంజీఎం!


**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

ఉత్తర తెలంగాణకే తలమానికంగా భావించే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ప్రస్తుతం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. నిత్యం వేలాది మంది పేద రోగులకు దిక్కుగా ఉండాల్సిన ఈ ఆస్పత్రి, ఇప్పుడు అవస్థలకు నిలయంగా మారింది. ఆస్పత్రికి వస్తున్న రోగులు ఒకవైపు అనారోగ్యంతో, మరోవైపు ఇక్కడి అస్తవ్యస్త పరిస్థితులతో నరకం చూస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, మౌలిక సదుపాయాల కొరత వెరసి ఎంజీఎం ఆస్పత్రి అంటేనే రోగుల భయపడే పరిస్థితి నెలకొంది ఆస్పత్రికి వచ్చే రోగులకు దిశానిర్దేశం చేయాల్సిన పీఆర్ఓ విభాగం కేవలం నామమాత్రంగానే మిగిలిపోయింది. కనీస సమాచారం ఇచ్చే వారు కూడా లేకపోవడంతో ఎమర్జెన్సీ వార్డు వద్ద తీవ్ర అయోమయం నెలకొంది.

**అస్తవ్యస్తంగా ఆస్పత్రి నిర్వహణ**

- పనిచేయని నెబ్యులైజేషన్ మిషన్లు
- ఉన్నవి మూడు.. అందులో పనిచేయనివి రెండు
- వైద్యం కోసం వస్తే రోగం ముదిరే పరిస్థితి
- ఒక్క బెడ్ పై ముగ్గురు రోగులు
- పట్టించుకోని పాలకులు






**పేపర్ బండిళ్ల కొరత అంటూ రోగి ఓపీ చిట్టీలను సైతం సగం వరకే చేసి ఇచ్చిన ప్రింట్**

### పనిచేయని నెబ్యులైజేషన్ మిషన్లు

ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల అస్తమా, శ్వాసకోశ వ్యాధులతో వస్తున్న రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే, వీరికి కనీస ప్రాథమిక చికిత్స అందించడంలో ఆస్పత్రి యాజమాన్యం ఘోరంగా విఫలమైంది. ఆస్పత్రి మొత్తంలో కేవలం మూడు నెబ్యులైజేషన్ పరికరాలు మాత్రమే ఉండగా, అందులో రెండు ఇప్పటికే మూలనపడ్డాయి. అందుబాటులో ఉన్న ఒక్క మిషన్ తోనే వందలాది మంది రోగులకు చికిత్స అందించాల్సి వస్తోంది. గంటల తరబడి వేచి ఉన్నా వంతు రాకపోవడంతో రోగులు ఊపిరి అందక విలవిలలాడుతున్నారు. ఒక్క నెబ్యులైజేషన్ మిషన్ నే అందరూ వాడాల్సి రావడం వల్ల ఒకరి నుంచి ఒకరికి అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని రోగులు ఆందోళన చెందుతున్నారు.

### ఒక్క బెడ్ పై ఇద్దరు, ముగ్గురు

ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కొరత భయంకరంగా ఉంది. వార్డుల్లోకి వెళ్తే పరిస్థితి మరింత ఘోరం. రోగుల రద్దీ దృష్ట్యా ఒక్కో బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు రోగులను పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. గాలి ఆడని గదులు, క్రిక్కిరిసిన బెడ్లు చూస్తుంటే ఆస్పత్రిలో కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదని స్పష్టమవుతోంది.

### కలెక్టర్ గారు.. తనిఖీ చేయండి

ఈ దయనీయ స్థితిపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఎంజీఎం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. నెబ్యులైజేషన్ పరికరాలను పెంచాలని, అదనపు బెడ్లు మరియు స్ట్రెచర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎంజీఎంకి పూర్వ వైభవం తీసుకురావాలని వరంగల్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మిడ్ మానేర్ పరిధిలో భూ మాయ!

**పాత గ్రామాలపై కబ్జాదారుల పడగ**

- ప్రభుత్వ ఆస్తులకు పొంచి ఉన్న ముప్పు
- రెవెన్యూ రికార్డులనూ లెక్క చేయని అక్రమార్కులు
- నిమ్మకు నీరెత్తినట్లుగా రెవెన్యూ యంత్రాంగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ వేడుకోలు





**వేద న్యూస్, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం పరిధిలోని మిడ్ మానేర్ రిజర్వాయర్ చుట్టుపక్కల భూములు ఇప్పుడు భూబకాసురులకు కాసుల కురిపించే వనరులుగా మారాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం సేకరించిన భూములు, ముంపునకు గురైన పాత గ్రామాల ఆస్తులపై కొంతమంది కబ్జాదారులు అక్రమంగా పెత్తనం చెలాయిస్తున్నారు. ముంపు బాధితులకు పరిహారం చెల్లించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను ఇప్పుడు మళ్లీ తమ ఆధీనంలోకి తెచ్చుకుంటూ బహిరంగంగానే కబ్జాలకు పాల్పడుతుండటం స్థానికంగా కలకలం రేపుతోంది.

### గతంలో డబ్బులు తీసుకుని

మిడ్ మానేర్ నిర్మాణ సమయంలో పాత గ్రామాల్లోని ఇళ్లు, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలకు సంబంధించి నిర్వాసితులు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో పరిహారం అందుకున్నారు. నియమ నిబంధనల ప్రకారం ఆ భూములన్నీ ఇప్పుడు ప్రభుత్వ ఆస్తి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పుడు ఆ భూముల్లోకి అక్రమార్కులు చొరబడుతున్నారు. అక్కడ అక్రమంగా పనులు చేపడుతూ ఆ భూమి తమదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనిని ప్రశ్నించిన సామాన్యులను కబ్జాదారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రికార్డులు ఉన్నా.. లెక్కచేయట్లే

మిడ్ మానేర్ ముంపు భూములకు సంబంధించి రెవెన్యూ మరియు నీటిపారుదల శాఖల వద్ద స్పష్టమైన రికార్డులు ఉన్నాయి. ఏ సర్వే నంబర్ భూమికి పరిహారం చెల్లించారు, ఏది ప్రభుత్వ ఆధీనంలో ఉంది అనేది స్పష్టంగా ఉన్నప్పటికీ, కబ్జాదారులు అవేమీ లెక్కచేయడం లేదు. రికార్డులను పక్కనబెట్టి, దౌర్జన్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. ఈ అక్రమాల వల్ల నిజమైన హక్కుదారులు నష్టపోవడమే కాకుండా, భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాల కోసం భూమి అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### అధికారుల మౌనం

ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు మరింత బరితెగిస్తున్నారు.

ముంపు భూముల చుట్టూ ఉన్న విలువైన ప్రభుత్వ ఆస్తులకు భద్రత కరువైందని, తక్షణమే సర్వే నిర్వహించకపోతే మిడ్ మానేర్ చుట్టూ ఉన్న భూములన్నీ అన్యాక్రాంతం అవుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..

ఈ భూ కుంభకోణంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ అధికారులతో సమగ్ర సర్వే చేయించి, అక్రమ ఆక్రమణలను తొలగించి, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, లేదంటే భవిష్యత్తులో ఈ భూములు తిరిగి పొందడం అసాధ్యమని గ్రామస్థులు తేల్చి చెబుతున్నారు. భూ కబ్జాలపై పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

# ముగిసిన కుర్చీలాట!



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

- వ్యూహ ప్రతివ్యూహాలతో పంతం నెగ్గించుకున్న పార్టీలు
- 7 కార్పొరేషన్లలో 5 చోట్ల రెపరెపలాడిన కాంగ్రెస్ జెండా
- కరీంనగర్‌లో 'కమలం'.. కొత్తగూడెంలో 'సీపీఐ'
- ఆదిలాబాద్‌లో బీజేపీకి మెజారిటీ ఉన్నా కాంగ్రెస్‌కే మేయర్ పీఠం

తెలంగాణ మున్సిపల్ చైర్మన్లు మరియు కార్పొరేషన్ల మేయర్ల ఎన్నిక ప్రక్రియ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారిగా మార్చేసింది. పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు అత్యంత చాకచక్యంగా, జిత్తులమారి వ్యూహాలను అమలు చేస్తూ రాజకీయ చతురతను ప్రదర్శించాయి. ఈ క్రమంలో కొన్ని పురపాలికల వద్ద అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, మరికొన్ని చోట్ల తెర వెనుక జరిగిన రాజకీయ బేరసారాలు అందరినీ విస్మయానికి గురిచేశాయి. ముఖ్యంగా నిన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటూ, బద్ధశత్రువుల్లా తలపడిన నేతలు సైతం పదవుల పంపకం కోసం తమ పాత పగలను పక్కనబెట్టి దోస్తీ కట్టడం ఈ ఎన్నికల్లో అత్యంత నాటకీయ పరిణామం. సిద్ధాంతాల కంటే స్థానిక రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని చాటుతూ, అసాధ్యమనుకున్న పొత్తులను సుసాధ్యం చేస్తూ సాగిన ఈ రాజకీయ కురుక్షేత్రం ఎట్టకేలకు మేయర్లు, చైర్మన్ల ఎన్నికతో ముగిసింది. ఎన్నో మలుపులు, సస్పెన్స్‌ల మధ్య నూతన పాలకవర్గాలు కొలువుదీరడంతో రాష్ట్రంలోని పట్టణ పాలనలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. అయితే, ఈ ఎన్నికల ప్రక్రియ కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా, ఊహించని రాజకీయ మలుపులు, సిద్ధాంతాలకు అతీతమైన పొత్తులు మరియు కొన్నిచోట్ల తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### హస్తానికి 'ఐదు'..

రాష్ట్రంలోని మొత్తం 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ అత్యంత నాటకీయంగా సాగింది. ఫలితాలను విశ్లేషిస్తే, కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ చతురతతో ఐదు కార్పొరేషన్లను కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. నల్లగొండ, మహబూబ్ నగర్, నిజామాబాద్, మంచిర్యాల మరియు ఆదిలాబాద్ కార్పొరేషన్లలో హస్తం పార్టీ జెండా ఎగిరింది. కరీంనగర్‌లో భారతీయ జనతా పార్టీ తన పట్టును నిలుపుకోగా, కొత్తగూడెంలో కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. ముఖ్యంగా ఆదిలాబాద్‌లో బీజేపీకి అత్యధిక స్థానాలు దక్కినప్పటికీ, మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఈ ఎన్నికల్లో అతిపెద్ద ట్విస్ట్‌గా నిలిచింది.

### 11 మున్సిపాలిటీల్లో వాయిదా

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ వేర్వేరు కారణాల వల్ల వాయిదా పడింది. జనగామ, ఇల్లందు, సుల్తానాబాద్, కాగజ్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి కీలక పురపాలికల్లో ఎన్నికలు నిర్వహించలేకపోతున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కొన్ని చోట్ల కోరం లేకపోవడం, మరికొన్ని చోట్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వాయిదా పడిన మున్సిపాలిటీల్లో మంగళవారం లేదా బుధవారం తిరిగి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో క్యాంపు రాజకీయాలు ఇంకా కొనసాగుతున్నాయి.

### చేతులు కలిపిన బద్ధ శత్రువులు

రాష్ట్ర రాజకీయాల్లో బద్ధశత్రువులుగా భావించే పార్టీలు స్థానిక పీఠం కోసం చేతులు కలపడం ఈ ఎన్నికల ప్రత్యేకత. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థి కంఠం శిరీషకు బీజేపీ కౌన్సిలర్లు మద్దతు తెలపడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అలాగే కామారెడ్డిలో మరీ విచిత్రంగా కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలు అధికారాన్ని పంచుకున్నాయి. ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ పదవి దక్కేలా ఒప్పందం కుదుర్చుకుని పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిణామాలు చూస్తుంటే రాష్ట్రస్థాయిలో వైరం ఉన్నా, స్థానిక రాజకీయాల్లో ప్రయోజనాలే పరమావధిగా పార్టీలు ముందుకు వెళ్తున్నాయని స్పష్టమవుతోంది.

### ఎటూ తేలని 'జనగామ'

అత్యంత ఉత్కంఠ రేపిన జనగామ మున్సిపాలిటీలో రాజకీయ చదరంగం క్లైమాక్స్‌కు చేరింది. ఇక్కడ బలాబలాలు సరిసమానంగా ఉండటంతో ఫలితం తేలడం లేదు. కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షం సీపీఎం కలిపి 13 సీట్లు సాధించగా, బీఆర్ఎస్ కూడా 13 సీట్ల వద్దే నిలిచింది.

ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్), ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఓటు నమోదు చేసుకోవడంతో ఇరువర్గాలకు తలో 14 ఓట్లు వచ్చాయి. ఇప్పుడు ఇక్కడ గెలిచిన నలుగురు ఇండిపెండెంట్లే 'కింగ్ మేకర్లు'గా మారారు. వీరి మద్దతు ఎటువైపు ఉంటే వారే పీఠాన్ని అధిష్టించనున్నారు. ప్రస్తుతానికి ఇక్కడ ఎన్నిక వాయిదా పడటం గమనార్హం.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 17, 2026

# కారేపల్లిలో అక్రమ మద్యం పట్టివేత

- ఆటోల్లో తరలింపు
- ఎక్సైజ్అధికారుల పాత్రపై అనుమానాలు




**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల కేంద్రంలో అక్రమ మద్యం రవాణా వ్యవహారం కలకలం రేపింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.2.5 లక్షల విలువైన మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో నిర్వహించిన దాడుల్లో ఆటోల్లో భారీగా మద్యం నిల్వలు పట్టుబడగా, అవి కారేపల్లిలోని 110 కనకదుర్గ వైన్ షాపున కు చెందినవిగా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను అధికారులు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఇలాంటి కేసుల్లో మీడియాకు వివరాలు వెల్లడించాల్సి ఉండగా, ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో బస్వాపూర్ ప్రాంతంలో కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోలేదని వారు గుర్తుచేస్తున్నారు. ఇదిలా ఉండగా, కారేపల్లి బస్టాండ్ ప్రాంతంలోని కొన్ని వైన్ షాపుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆటోల ద్వారా ఏజెన్సీ గ్రామాలకు మద్యం తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను స్థానికులు కోరుతున్నారు.

# చైర్మన్, వైస్ చైర్మన్‌లకు నియామక పత్రాల అందజేత

**వేద న్యూస్, కారేపల్లి:**



వైరా మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్‌గా కట్ల సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలియజేసి, మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని ఆకాంక్షించారు. నియామక పత్రాలు అందుకున్న డాక్టర్ చంద్రకళ, కట్ల సంతోష్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ వైరా మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కౌన్సిలర్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలిపారు.

# కోటిలింగాలలో వీరన్న నాయక్ ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, కారేపల్లి:**




పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోటిలింగాల పుణ్యక్షేత్రంలో జరిగిన జాతర సందర్భంగా ప్రముఖ నాయకుడు అజ్మీరా వీరన్న నాయక్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అనుచర గణంతో ఆలయానికి చేరుకున్న ఆయన భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కోటిలింగాల క్షేత్రం ప్రాంతానికి మహిమాన్వితమైన పుణ్యస్థలమని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వీరన్న నాయక్‌కు ఘన స్వాగతం పలికారు.

# కోటిలింగాలలో ఎమ్మెల్యే సతీమణి పూజలు

**వేద న్యూస్, కారేపల్లి:**



మండల పరిధిలోని పోలంపల్లి గ్రామ పంచాయతీలో వెలసిన కోటిలింగాల పుణ్యక్షేత్రంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సతీమణి మాలోత్ లలిత స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ కోటిలింగాల క్షేత్రం మహిమాన్వితమైన పుణ్యస్థలమని, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నేతృత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, సర్పంచ్‌లు హీరాలాల్, హేమలత బాలాజీ, మేదరి వీర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరి సుధా బాలుకు బీసీ జేఏసీ విషెస్

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిలుకూరి సుధా బాలును బీసీ జేఏసీ నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ.. జనరల్ స్థానమైన మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించడం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు నిదర్శనమని తెలిపారు. ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘువీరా రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది బీసీలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, ధోనెటి శేఖర్, ఎస్పీ నాయుడు, రాంబాబు యాదవ్, కొత్త వెంకట్, దుర్గయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ సర్పంచ్ 'టోనీ'

- వీధి కుక్కల సమస్య పరిష్కారంపై ప్రజల ఆశలు



**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండల కేంద్రం సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే రోడ్ల పునర్నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాంత రూపురేఖలను మార్చారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న టోనీపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, బైక్‌లపై వెళ్లేవారిని వెంబడిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని, అభివృద్ధిలో ముందంజలో ఉన్న కారేపల్లిని భద్రత పరంగా కూడా ఆదర్శంగా నిలిపేందుకు సర్పంచ్ టోనీ చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# శాంతియుతంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



**వేద న్యూస్, తూప్రాన్:**

మెదక్ జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ పరోక్ష ఎన్నికలు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. తూప్రాన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో జిల్లా ఎస్పీ స్వయంగా అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అదనపు పోలీస్ బలగాలను మోహరించి, అధికారులతో సమన్వయం చేస్తూ తక్షణ చర్యలు చేపట్టి శాంతిభద్రతలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పోలీస్ అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ మున్సిపాలిటీ కార్యాలయాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతను బలోపేతం చేశారు. ప్రవేశ-నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచి గస్తీ చర్యలు చేపట్టారు. పోలీస్ శాఖ సమర్థవంతమైన విధుల నిర్వహణతో ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా ముగిశాయని ఎస్పీ వెల్లడించారు. ఎన్నికలు విజయవంతం కావడానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అభినందించారు.

# ప్రశాంతంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- అదనపు ఎస్పీ మహేందర్




**వేద న్యూస్, నర్సాపూర్:**

నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పరోక్ష ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడ్డాయని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను బలోపేతం చేశారని, ప్రవేశనిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేసినట్లు వెల్లడించారు. పోలీస్ శాఖ సమర్థవంతమైన విధుల నిర్వహణతో ఎన్నికలు శాంతియుతంగా ముగిశాయని అదనపు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్‌గా చిలుకూరి సుధాబాల కృష్ణ, వైస్ చైర్మన్‌గా గుడిపాటి శిరీష నవీన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయగా, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగి వారు బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 మంది, బీఆర్ఎస్‌కు చెందిన 14 మంది, బీజేపీకి చెందిన ఒకరు, ఇతరులు ఇద్దరు కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, దామరచర్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, బీసీ సంఘ నాయకులు నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందించారు.

# శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

- వైభవంగా శివరాత్రి పర్వదినం



**వేద న్యూస్, రుద్రూర్:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయం, భక్త మార్కండేయ ఆలయం, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే లింగంపల్లి శివాలయంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం తమ దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిసార్, వార్డు సభ్యులు రాజశేఖర్, వెంకటేష్, మహిళలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 17, 2026

# అధ్వాన్నంగా బోయినిపల్లి బస్టాండ్

- నీడ లేదు.. నీరు లేదు.. టాయిలెట్ లేదు
- ప్రయాణికుల కష్టాలు పట్టించుకునే వారే లేరు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రయాణికులకు ఉపయోగపడని స్థితికి చేరుకుంది. పేరు మాత్రమే బస్టాండ్ ఉన్నా, అక్కడ ప్రయాణికులు నిలబడేందుకు సరైన నీడ, కూర్చునే సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు, వర్షాలు అన్న




తేడా లేకుండా ప్రజలు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ వద్ద తాగునీటి సదుపాయం లేకపోవడం, టాయిలెట్ సౌకర్యం లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపార అవసరాల కోసం నిత్యం ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ కనీస వసతులు లేక ప్రయాణం కష్టసాధ్యంగా మారింది. అలాగే బస్టాండ్ వద్ద బెంచీలు, రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో తక్షణమే నీడ, తాగునీరు, శుభ్రమైన టాయిలెట్లు, కూర్చునే సీట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోయినిపల్లి బస్టాండ్‌ను ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

# శివక్షేత్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక పూజలు

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలోని శ్రీ దుబ్బ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా సోమవారం నిర్వహించిన శాంతి హోమం, బలిహరణం, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లందుల ప్రసాద్, టెంపుల్ చైర్మన్ కోలపురి అనంతగిరి, మాజీ ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, పాశం రాజేందర్, సుధగోని తిరుపతి గౌడ్, కేతిరెడ్డి వెంకటరెడ్డి, నవీన్, వల్లంపట్ల అనిల్, ఎం. రాజు, ప్రభాకర్, వెంకట్‌తో పాటు అర్చకులు పవన్ శర్మ, విఠల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో సెక్షన్ 144 అమలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (సెక్షన్ 144) అమలులో ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఐదుగురికి మించిన గుంపులుగా చేరడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, సభలు, బైక్ ర్యాలీలు, డీజే కార్యక్రమాలు, టపాకాయలు కాల్చడం, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపరచాలి

- వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు
- రబీ ధాన్య సేకరణకు పూర్తి ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా వసతులను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రబీ ధాన్య సేకరణ, వేసవిలో త్రాగునీటి చర్యలు, రోడ్డు భద్రత పనులు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, గైర్హాజరు లేదా నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో త్రాగునీటి కొరత తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని, హ్యాండ్ పంపుల మరమ్మత్తులు, నీటి వనరుల గుర్తింపు పనులు



పూర్తి చేయాలని ఆదేశించారు. రబీ సీజన్ ధాన్య కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, మిల్లర్లతో ముందుగానే సమన్వయం చేసుకోవాలని సూచించారు. గతంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని పరిష్కార చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జిల్లాలో ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించిన 30 బ్లాక్‌స్పాట్ల వద్ద రోడ్డు భద్రత చర్యలను వేగవంతం చేయాలని, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డులు, లైన్ మార్కింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో

- తల్లి, కొడుకుకు గాయాలు
- నల్లబెల్లి మండలంలో ఘటన

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం బిలనాయక్ తండా శివారులోని హైవే-365 రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం, నర్సంపేట నుంచి అడవి మల్లంపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా ఆగిపోవడంతో, దాని వెనుక వస్తున్న ఆటో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గూడూరు మండలం మట్టేవాడ గ్రామానికి చెందిన హరిబండి రత్నమాల (50), సునీల్ (30) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అకస్మాత్తుగా వాహనాలు ఆగిపోవడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కెనాల్ పనులు పూర్తి చేయాలని రైతుల నిరాహార దీక్ష



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్ట్ 11వ ప్యాకేజ్, ఆర్‌డీ 3 ఎల్‌ఎం 6 కెనాల్ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఇక నుంచి రాత్రివేళల్లో కూడా దీక్ష శిబిరం వద్దే ఉండి నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కాల్వ పనులు పూర్తయ్యే వరకు దీక్షను విరమించబోమని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని హెచ్చరించారు. కాల్వ పనులు పూర్తి కాకపోవడంతో సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని, వెంటనే అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ దీక్షలో రైతులు ఎల్లవేణి రమేష్, కరికె నవీన్ కుమార్, సేరు శ్రీనివాస్, కమటం రవి, కొమ్ముల లచ్చయ్య, గాదె మహేష్, పయ్యావుల శ్రీనివాస్, స్వామి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈఓ దీక్షా రైన, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, అదనపు జిల్లా వైద్య అధికారి డా. చందునాయక్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, డీపీవో రాంబాబు, మిషన్ భగీరథ అధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

**వేద న్యూస్, కాజీపేట:**



స్టేషన్ ఘనపూర్ ప్రాంతానికి చెందిన వడ్డెర కులస్తుడు రాపోలు ముత్తు లింగయ్య మరణించగా, రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేసి తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్, పల్లగుట్ట గ్రామ అధ్యక్షుడు శివరాత్రి కుమార్, రాంపూర్ గ్రామ అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, శివరాత్రి నాగరాజు తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

**వేద న్యూస్, కారేపల్లి:**



బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలు కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో ఘనంగా నిర్వహించారు. యువ నాయకులు గుగులోత్ హేరు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తండా వాసులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ చూపిన అహింసా మార్గం సకల మానవాళికి ఆదర్శమని వక్తలు కొనియాడారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జగన్ నాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సీలాల్, గుగులోత్ భగవాన్ దాస్, ఆలోత్ నందరాజ్, వార్డు సభ్యులు, నాయకులు, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా సుఖేందర్ గౌడ్ సస్పెన్షన్

- మెట్‌పల్లి రాజకీయాల్లో సంచలనం

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

మెట్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినందుకు బీజేపీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా సుఖేందర్ గౌడ్‌ను పార్టీ నాయకత్వం సస్పెండ్ చేసింది. చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పార్టీ జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా వ్యతిరేకంగా ఓటు వేసినట్లు గుర్తించిన నాయకత్వం క్రమశిక్షణ చర్యగా సస్పెన్షన్ విధించినట్లు సమాచారం. పార్టీ నియమాలు, క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని నాయకులు స్పష్టం చేశారు. ఈ పరిణామంతో మెట్‌పల్లి మున్సిపల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# పదవులు సతులకు.. అధికారాలు పతులకు!

## నర్సింహులపల్లి గ్రామపంచాయతీలో చర్చనీయాంశం



**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం నర్సింహులపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవి ఒకరిది, అధికారాలు మరొకరిదిగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ చెక్కపెల్లి శరణ్య సభాధ్యక్ష స్థానంలో ఉన్నప్పటికీ, సమావేశాన్ని ఆమె భర్త చెక్కపెల్లి లింగారెడ్డి స్వయంగా నడిపించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడాల్సిన సందర్భంలో ఆమె భర్త జోక్యం చేసుకుని సమావేశాన్ని నిర్వహించడంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నించగా, ఆయన ఘాటుగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారిక కార్యక్రమాల్లో సర్పంచ్ స్థానంలో కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు రిజర్వేషన్ ద్వారా పదవులు లభిస్తున్నప్పటికీ, వాస్తవ అధికారాలు ఇతరుల చేతుల్లో ఉండటం సరైంది కాదని గ్రామస్థులు పేర్కొన్నారు. సర్పంచ్ పదవిలో ఉన్నవారే స్వయంగా బాధ్యతలు నిర్వహించి, ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలని వారు కోరుతున్నారు. ఇకపై ఇలాంటి పరిస్థితులకు ముగింపు పలికి, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పరిపాలన కొనసాగించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా లింబాద్రి, వైస్ చైర్మన్‌గా ఓంకారి నవీన్

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 17వ వార్డు కౌన్సిలర్ మైలారపు లింబాద్రి చైర్మన్‌గా, 1వ వార్డు కౌన్సిలర్ ఓంకారి నవీన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బీజేపీ మద్దతుతో ఈ ఎన్నికలు ముగియడంతో పట్టణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. వార్డు స్థాయి నాయకత్వం నుంచి పట్టణ స్థాయి బాధ్యతలు చేపట్టిన లింబాద్రి, నవీన్ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కొత్త పాలకవర్గంపై స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది.





# చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టం



**వేద న్యూస్, కరీంనగర్:**

- అవినీతిపరులే మేయర్, డిప్యూటీ మేయర్ అయ్యారు
- వెలిచాల రాజేందర్ రావు

కరీంనగర్ నగర పాలక సంస్థలో అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక విజిలెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. సోమవారం డిసిసి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్‌లో చిన్న అవినీతి జరిగినా సహించబోమని స్పష్టం చేశారు. బీజేపీ పాలకవర్గంపై నిరంతర నిఘా ఉంచి, ప్రతి డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనులు, బిల్డింగ్ అనుమతులు, చెల్లింపులను ప్రత్యేక కమిటీల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. అవినీతికి పాల్పడిన వ్యక్తులే మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో నగరానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తామని పేర్కొన్నారు. అవినీతి జరిగితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, భాస్కర్ నాయక్, గుమ్మడి రాజకుమార్, ఆకుల నందిని ఉదయ్, పడిశెట్టి వసంత లక్ష్మి, కల్లేపల్లి శారద, సికిందర్ ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల ఊరేగింపుపై పోలీస్ బందోబస్తు పరిశీలన



- అదనపు ఎస్పీ మహేందర్

**వేద న్యూస్, పాపన్నపేట:**

మెదక్ జిల్లా నగసన్పల్లిలో జరుగుతున్న ఏడుపాయల వనదుర్గామాత జాతర రెండో రోజు సందర్భంగా నిర్వహించిన బండ్ల ఊరేగింపును పురస్కరించుకుని అదనపు ఎస్పీ మహేందర్ జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఊరేగింపు మార్గం, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో తొక్కిసలాటలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధంగా నిర్వహించడం, పార్కింగ్ ప్రదేశాల్లో సిబ్బందిని నియమించడం, క్యూలైన్లను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. జాతర ప్రాంతమంతటా నిరంతర పోలీస్ నిఘా కొనసాగిస్తూ, సీసీటీవీ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు.

## కుస్తీ పోటీల్లో మల్లయోధుల ప్రతిభ



**వేద న్యూస్, రుద్రూర్:**

మహాశివరాత్రి సందర్భంగా రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కిషన్ రావు పటేల్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామ శివారులో నిర్వహించిన ఈ పోటీలు మధ్యాహ్నం ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ పటేల్, సర్పంచ్ మచ్కూరి రమేష్, ఉపసర్పంచ్ పిట్ల కళ్యాణ్, మాజీ సర్పంచ్ వేముల సురేష్, మాజీ ఉపసర్పంచ్ చింతల గంగాధర్, వేముల రమేష్, నాగనాథ్, జెల్ల సాయిలు, గుడిసె పోశెట్టి, వేముల కరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు శుభాకాంక్షలు





**వేద న్యూస్, మరిపెడ:**

మరిపెడ బంగ్లా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన శ్రీమతి ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన శ్రీమతి కాలం సునీత రవీందర్ రెడ్డికి పట్టణ ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వంలో మరిపెడ బంగ్లా పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేలా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శ పాలన అందించాలని మున్సిపల్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.


## స్వామివారికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక పూజలు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ గంగాధర క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వామివారిని దర్శించి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, స్థానిక సర్పంచ్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ సెంటర్‌ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో జరుగుతున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా సమీక్షించారు. అంతకుముందు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా కొనసాగుతున్న తీరును అధికారులు వివరించారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి రాజమణి దంపతులు మంగళ వాయిద్యాల మధ్య పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్టించి, భజనలు, నృత్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మంగళహారతులు సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మహిళలు సహా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నల్లబెల్లిలో ఘనంగా ఎల్లమ్మ పట్నాలు



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కేంద్రంలో దిండు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ గుడికి ఊరేగింపుగా వెళ్తుండగా, శివసత్తువు ప్రవీణ్ అమ్మవారి వేషధారణలో దర్శనమిచ్చి డప్పు కళాకారులతో కలిసి ఆటలు ప్రదర్శించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగి గ్రామస్తులను ఆకట్టుకుంది. ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు, ఆరతులు నిర్వహించగా, గ్రామస్తులు, గౌడ సంఘం సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పట్నాలు స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మండలంలో ఉత్సవ వాతావరణాన్ని సృష్టించాయి. కార్యక్రమంలో దిండు శీను, రవి, ముత్యాల ప్రవీణ్, రాము, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 17, 2026

# బీజేపీది ధర్మ విజయం

**– బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి**



**వేద న్యూస్, శంకరపట్నం:**

తాజాగా జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకొని, మేయర్ మరియు డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకున్న సందర్భంగా బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఏనుగు అనిల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుటిల రాజకీయాలు చేసినప్పటికీ చివరికి ధర్మమే గెలిచిందన్నారు. సామాన్య కార్యకర్తను మేయర్‌గా చేయడం బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికే సాధ్యమైందని పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి ప్రారంభమైన బీజేపీ జైత్రయాత్ర రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్ష్యాలకంటే ట్రెండ్‌ల వెంబడి పరుగులు

- వేగం పెరిగిన ప్రపంచం దిశ కోల్పోతున్న యువత?
- సామాజిక మాధ్యమాల ప్రభావం ప్రేరణా? ప్రలోభనా?
- పోలికల సంస్కృతి వ్యక్తిత్వానికి ముప్పా?
- స్థిరమైన లక్ష్యాలే శాశ్వత విజయానికి మార్గం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచం ఇంత వేగంగా మారిన కాలం ఇంతకుముందు కనిపించలేదు. ప్రతి రోజు కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు, కొత్త ఆకర్షణలు ముందుకొస్తున్నాయి. ఒక ట్రెండ్ ఉదయం మొదలైతే సాయంత్రానికే దేశమంతా చర్చిస్తోంది. ఈ వేగంలో ముఖ్యంగా యువత జీవన దిశను నిర్ణయించుకోవడంలో అయోమయానికి గురవుతోందా అన్న ప్రశ్న ముందుకొస్తోంది. లక్ష్యాలకంటే ట్రెండ్‌లే ప్రాముఖ్యంగా మారుతున్నాయా అన్న సందేహం సమాజాన్ని ఆలోచింపజేస్తోంది.

సామాజిక మాధ్యమాల విస్తరణతో సమాచారానికి హద్దుల్లేవు. ఎవరు ఏం చేస్తున్నారు, ఎవరు ఎలా విజయాన్ని సాధించారు అన్న కథనాలు క్షణాల్లో చేరుతున్నాయి. ఒక వీడియో వైరల్ అయితే అది విజయానికి చిహ్నంగా భావిస్తున్నారు. ఒక రంగంలో ప్రాచుర్యం పెరిగితే, అందరూ అదే దిశగా పరిగెడుతున్నారు. కానీ ఆ ట్రెండ్ వెనుక ఉన్న వాస్తవాలు, కష్టాలు, స్థిరత్వం గురించి చాలా అరుదుగానే ఆలోచిస్తున్నారు. ఫలితంగా తాత్కాలిక ఆకర్షణలే ప్రధానంగా మారుతున్నాయి.

యువతలో కెరీర్ ఎంపికల విషయంలో కూడా ఈ ధోరణి కనిపిస్తోంది. ఒక రంగం ప్రాచుర్యం పొందితే, దాని వైపు వేలాది మంది మొగ్గుచూపుతున్నారు. తమ ఆసక్తులు, సామర్థ్యాలు, దీర్ఘకాల లక్ష్యాలు పరిశీలించకుండా ట్రెండ్‌ను అనుసరించడం అలవాటుగా మారుతోంది. ట్రెండ్ ముగిసిన తర్వాత దిశ కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాదు, సమాజ స్థాయిలోనూ నైపుణ్యాల అసమతుల్యతకు దారి తీస్తుంది.

పోలికల సంస్కృతి ఈ సమస్యను మరింత పెంచుతోంది. ఇతరులు ఏం సాధించారు అన్నదే ప్రమాణంగా మారుతోంది. తమ ప్రయాణాన్ని అర్థం చేసుకునే కంటే ఇతరుల విజయాలతో పోల్చుకోవడం పెరిగింది. ఈ పోలికలు అసహనం, అసంతృప్తి, ఆత్మవిశ్వాస లోపానికి దారి తీస్తున్నాయి. వ్యక్తిత్వం కంటే ప్రాచుర్యమే ముఖ్యం అన్న భావన పెరుగుతోంది. ఇది స్థిరమైన లక్ష్యాల నిర్మాణానికి ఆటంకం.

లక్ష్యం అనేది క్షణిక ఆలోచనతో ఏర్పడేది కాదు. అది ఆత్మపరిశీలనతో, అనుభవంతో, పరిశోధనతో ఏర్పడాలి. మన బలాలు, బలహీనతలు, ఆసక్తులు, విలువలు విశ్లేషించాలి. ట్రెండ్‌లు ప్రేరణ ఇవ్వవచ్చు. కానీ అవే జీవిత దిశను నిర్ణయించకూడదు. తాత్కాలిక హడావుడి కంటే దీర్ఘకాల ప్రణాళిక ముఖ్యం. విజయం అనేది క్రమశిక్షణతో కూడిన ప్రయాణం.

ఇది సమాజానికి కూడా ఒక హెచ్చరిక. ఒక తరం స్థిరమైన లక్ష్యాల కంటే తాత్కాలిక ఆకర్షణల వైపు మళ్లితే, పరిశోధన, శాస్త్రం, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో లోతు తగ్గిపోవచ్చు. దేశ అభివృద్ధికి దీర్ఘకాల కృషి అవసరం. ట్రెండ్‌లతో మాత్రమే స్థిరమైన ప్రగతి సాధ్యం కాదు. నైపుణ్యాల్లో లోతు, ఆలోచనలో స్థిరత్వం అవసరం. అయితే ట్రెండ్‌లను పూర్తిగా నిరాకరించాల్సిన అవసరం లేదు. అవి సమాజంలో మార్పుల సూచికలు. కొత్త అవకాశాలను పరిచయం చేస్తాయి. కానీ వాటిని విమర్శనాత్మకంగా విశ్లేషించాలి. ప్రతి ట్రెండ్ మనకు సరిపోతుందా? అది మన లక్ష్యానికి తోడ్పడుతుందా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. నిర్ణయాలు భావోద్వేగంతో కాకుండా ఆలోచనతో తీసుకోవాలి.

విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం యువతకు సరైన దిశానిర్దేశం చేయాలి. విజయాన్ని కేవలం ప్రాచుర్యంతో కొలవకూడదని తెలియజేయాలి. కష్టపడి సాధించిన స్థిరమైన విజయమే నిజమైన విజయమని బోధించాలి. స్వీయ అవగాహన పెంపొందించే కార్యక్రమాలు అవసరం.

మొత్తంగా లక్ష్యాలకంటే ట్రెండ్‌ల వెంబడి పరిగెత్తడం తాత్కాలిక ఆనందాన్ని ఇవ్వవచ్చు. కానీ శాశ్వత విజయానికి దిశ అవసరం. యువత తమ అంతర్గత స్వరాన్ని వినాలి. తమ ప్రతిభను గుర్తించాలి. ట్రెండ్‌లను సాధనంగా ఉపయోగించాలి గానీ లక్ష్యాల స్థానంలో పెట్టకూడదు. స్థిరమైన లక్ష్యాలతో సాగిన ప్రయాణమే వ్యక్తిత్వాన్ని నిలబెడుతుంది. అదే దేశ భవిష్యత్తును బలపరుస్తుంది. లక్ష్యం అనేది దీర్ఘకాల దిశ. అది ఆలోచనతో, పరిశీలనతో, స్వీయ అవగాహనతో ఏర్పడాలి. మన బలాలు, ఆసక్తులు, సామర్థ్యాలు తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి. ట్రెండ్‌లు ప్రేరణ ఇవ్వవచ్చు. కానీ అవే దిశను నిర్ణయించకూడదు. తాత్కాలిక హడావుడి కన్నా స్థిరమైన ప్రణాళిక ముఖ్యం.

ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు. సమాజ స్థాయిలో కూడా ప్రభావం చూపుతుంది. ఒక తరం స్థిరమైన లక్ష్యాల కంటే తాత్కాలిక ఆకర్షణల వైపు మళ్లితే, నైపుణ్యాల్లో లోతు తగ్గే ప్రమాదం ఉంది. పరిశోధన, శాస్త్రం, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో దీర్ఘకాల కృషి అవసరం. ట్రెండ్‌లతో మాత్రమే దేశ అభివృద్ధి సాధ్యం కాదు.

అయితే ట్రెండ్‌లను పూర్తిగా నిరాకరించాల్సిన అవసరం లేదు. అవి సమాజ మార్పులను సూచిస్తాయి. కొత్త అవకాశాలను పరిచయం చేస్తాయి. కానీ వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించాలి. ప్రతి ట్రెండ్ మన జీవితానికి సరిపోతుందా? అది మన లక్ష్యానికి దోహదపడుతుందా? అనే ప్రశ్నలు వేసుకోవాలి.

మొత్తంగా లక్ష్యాలకంటే ట్రెండ్‌ల వెంబడి పరిగెత్తడం తాత్కాలిక సంతృప్తిని ఇవ్వవచ్చు. కానీ దీర్ఘకాల విజయానికి స్థిరమైన దిశ అవసరం. యువత తమ అంతర్గత స్వరాన్ని వినాలి. తమ ఆసక్తులను గుర్తించాలి. ట్రెండ్‌లను అనుసరించడంలో జాగ్రత్త అవసరం. లక్ష్యం ఉన్న ప్రయాణమే నిజమైన విజయాన్ని అందిస్తుంది. అదే వ్యక్తిత్వాన్ని నిలబెడుతుంది. అదే భవిష్యత్తును బలపరుస్తుంది.

లక్ష్యం అనేది క్షణిక ఆలోచనతో ఏర్పడేది కాదు. అది ఆత్మపరిశీలనతో, అనుభవంతో, పరిశోధనతో ఏర్పడాలి. మన బలాలు, బలహీనతలు, ఆసక్తులు, విలువలు విశ్లేషించాలి. ట్రెండ్‌లు ప్రేరణ ఇవ్వవచ్చు. కానీ అవే జీవిత దిశను నిర్ణయించకూడదు. తాత్కాలిక హడావుడి కంటే దీర్ఘకాల ప్రణాళిక ముఖ్యం. విజయం అనేది క్రమశిక్షణతో కూడిన ప్రయాణం.

# మంచినీటి సరఫరాపై సమీక్ష సమావేశం

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు మంచినీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ ట్యాంకులను తరచుగా శుభ్రం చేయడం, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి ప్రతి ఇంటికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. మిషన్ భగీరథ డిప్యూటీ ఇంజనీర్లు బాలరాజు, అనిల్ మాట్లాడుతూ, నీటి సరఫరాలో ఏ సమస్య వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపీవో, మండల స్థాయి అధికారులు,



సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మేయర్, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**వేద న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలోని ఒక నగరపాలక సంస్థ, నాలుగు మున్సిపాలిటీలకు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించబడినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా చల్లా రమ్య ఎన్నికయ్యారు. బెల్లంపల్లిలో చైర్‌పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్‌పర్సన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ, చెన్నూరులో చైర్‌పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్‌గా నాయకపు వినయ్, లక్సెట్టిపేటలో చైర్‌పర్సన్‌గా దొంత అంజలి, వైస్ చైర్‌పర్సన్‌గా మోతుకూరి రాజేశ్వరి ఎన్నికయ్యారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో కోరం లేకపోవడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను



ఈ నెల 17కు వాయిదా వేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు.

# వద్దు బాల్య వివాహం.. ముద్దు విద్యా వికాసం

**వేద న్యూస్, కారేపల్లి:**

బాల్య వివాహం సామాజిక నేరమని, ఆడబిడ్డల భవిష్యత్తును నాశనం చేసే చర్య అని కారేపల్లి మండల అధికారులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ పొన్నూరు శ్రీనివాసరావు, తహశీల్దార్ అనంతుల రమేష్ పాల్గొని మాట్లాడారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు పూర్తి కాకుండా వివాహం జరిపించడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వివాహాలు నిర్వహించిన తల్లిదండ్రులు, సహకరించిన వారిపై రెండేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.

**– ఎంపీడీఓ, తహసీల్దార్**

చిన్న వయసులో పెళ్లిళ్లు బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి నిరంజన్ సమన్వయంతో మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగే ప్రయత్నాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఖమ్మం జిల్లాను 2030 నాటికి బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# సూర్యాపేట మున్సిపాలిటీ ‘హస్త’గతం

**వేద న్యూస్, సూర్యాపేట:**

గత రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరించి సూర్యాపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు ఘన విజయం అందించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం నేర్పారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ 31 స్థానాలు గెలుచుకుని, మరో ముగ్గురు స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతుతో మొరిశెట్టి నివేదిత లక్ష్మీదిని చైర్‌పర్సన్‌గా, మహమ్మద్ షఫీ ఉల్లాను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం నిర్వహించిన అనంతరం పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు అడుగడుగున జననీరాజనం పలుకుతూ సంబరాలు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి సహకారంతో సూర్యాపేట అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తామని నాయకులు తెలిపారు. ప్రజలు చూపిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



– కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

# రామలింగేశ్వర దేవాలయంలో కిటకిటలాడిన భక్తులు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామంలోని శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు సూరి శర్మ, మణిశర్మ భక్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సర్పంచ్ పిల్లల సందీప్ దంపతులు, దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ “ఓం నమశివాయ” నామస్మరణతో మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి భక్తులు జాగరణ నిర్వహించి స్వామివారి కృప కోసం ప్రార్థించారు. అలాగే రాజమండ్రి కళాకారుల ఆధ్వర్యంలో నందీశ్వరుని శోభాయాత్ర, శివశక్తుల ప్రదర్శనలు గ్రామంలో ఆకట్టుకున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- జిల్లా పోలీసు కార్యాలయంలో 39 అర్జీలు స్వీకరణ
- చట్టపరమైన, వేగవంతమైన చర్యలకు ఎస్పీ దిశానిర్దేశం

**వేద న్యూస్ అమరావతి:**




ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ పోలీసు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి మొత్తం 39 అర్జీలు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను స్వయంగా తెలుసుకుని సానుకూలంగా స్పందించారు. చట్టపరమైన మరియు వేగవంతమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగేలా సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. ప్రజల విశ్వాసం నిలబెట్టే విధంగా పారదర్శకంగా వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చట్టపరమైన చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. వ్యక్తిగత, కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత అంశాలు, సైబర్ మోసాలు తదితర విషయాలపై ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

# స్క్రీన్ మిర్రరింగ్ స్కామ్‌పై పోలీసుల హెచ్చరిక

- నకిలీ కాల్స్‌తో బ్యాంకు ఖాతాలు ఖాళీ
- అనుమానం ఉంటే 1930కు ఫిర్యాదు చేయాలి

**వేద న్యూస్ హైదరాబాద్ :**




స్క్రీన్ మిర్రరింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై తెలంగాణ పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. బ్యాంకు అధికారుల పేరుతో నకిలీ కాల్స్ చేసి బాధితుల ఫోన్లలో ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయించి ఖాతాల్లోని సొమ్మును దోచుకుంటున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు సిబ్బందిగా పరిచయం చేసుకుని స్క్రీన్ మిర్రరింగ్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేయాలని కోరుతున్నారు. బాధితులు ఆ లింకులపై క్లిక్ చేసి యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్‌లోని సమాచారమంతా మోసగాళ్లకు అందుబాటులోకి వెళ్తుంది. ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు సులభంగా తెలుసుకుని ఖాతాలను ఖాళీ చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు. బ్యాంకు సంబంధిత కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకూడదని, గుర్తు తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. ఎటువంటి అనుమానం వచ్చిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు సూచించారు.

# నకిలీ చలానాలతో సైబర్ మోసాలు

- ప్రజలకు పోలీసుల హెచ్చరికలు



**వేద న్యూస్ అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ చలానాల పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘనలు చేశారంటూ నకిలీ సందేశాలు పంపించి ప్రజల బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును దోచుకుంటున్నారు. అసలైన చలానాల్లాగే కనిపించే లింకులు పంపడంతో చాలామంది మోసపోతున్నారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల పేరుతో పెండింగ్ చలానా ఉందంటూ సందేశాలు పంపిస్తున్నారు. జరిమానా చెల్లించేందుకు అందులో ఇచ్చిన లింకుపై నొక్కాలని సూచిస్తున్నారు. జరిమానా మొత్తాన్ని తక్కువగా చూపించి నమ్మకం కలిగిస్తారు. లింకుపై నొక్కగానే నకిలీ వెబ్‌సైటుకు దారి తీస్తుంది. అక్కడ ఓటీపీలు, కార్డు వివరాలు నమోదు చేయాలని కోరుతుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే ఖాతాలోని సొమ్ము మాయం అవుతోంది. కొన్ని సందర్భాల్లో అనువర్తన ఫైళ్లు పంపించి వాటిని తెరిస్తే దుష్ట సాఫ్ట్‌వేర్ ఫోన్‌లో చేరి పూర్తి నియంత్రణను నేరగాళ్లకు ఇస్తోంది. విజయవాడలో ఒక వ్యక్తి నకిలీ చలానా లింకుపై నొక్కగా అతని కార్డుల నుంచి రూ.1.78 లక్షలు పోయాయి. మరో వ్యక్తి నకిలీ అనువర్తనం తెరిచిన కొద్దిసేపటికే రూ.2.10 లక్షలు కోల్పోయాడు. ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో పలుచోట్ల నమోదవుతున్నాయి. ఇలాంటి సందేశాలకు స్పందించవద్దని పోలీ సులు హెచ్చరిస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే చలానా వివరాలు పరిశీలించాలని సూచిస్తున్నారు. తెలియని లింకులను నొక్కకూడదని, వ్యక్తిగత మరియు బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని స్పష్టం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉంటేనే సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని అధికారులు తెలిపారు.




# డ్రగ్స్ ముఠా అరెస్ట్

- అదుపులో వ్యాపారులు, విద్యార్థి సహా ముగ్గురు
- 15 గ్రాముల కొకైన్ స్వాధీనం

**వేద న్యూస్ హైదరాబాద్ :**



గచ్చిబౌలిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను ఈగల్ బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో ఇద్దరు వ్యాపారులు, ఒక విద్యార్థి సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 15 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మురళీకృష్ణంరాజుతో పాటు వ్యాపారవేత్తలు చిరంజీవి వర్మ, హేమంతరాజును అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నైజీరియా దేశస్థుల నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ముఠా నగరంలోని సుమారు 15 మంది ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం. డ్రగ్స్‌ను చాక్లెట్ గిఫ్ట్ ప్యాకుల్లా తయారు చేసి ర్యాపిడో సేవల ద్వారా డెలివరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# కొత్త కారు కొనాలనుకుంటున్నారా? అయితే ఏప్రిల్ వరకు ఆగండి!



**వేద న్యూస్ డెస్క్:**

భారత్‌బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అయిన (సీటా) ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉండటంతో విదేశీ కార్లు, ముఖ్యంగా బ్రిటన్‌లో తయారయ్యే వాహనాలు భారత మార్కెట్లో మరింత చౌకగా లభించే అవకాశముంది.

భారత్ మరియు యునైటెడ్ కింగ్డమ్ జూలై 24, 2025న ఈ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం 99 శాతం భారతీయ ఉత్పత్తులు సుంకం లేకుండా బ్రిటన్‌కు ఎగుమతి చేయవచ్చు. అదే సమయంలో బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించబడతాయి.

ప్రస్తుతం బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్ వాహనాలపై సుమారు 110 శాతం వరకు సుంకం ఉంది. సీటా అమలులోకి వచ్చిన తరువాత ఈ సుంకాన్ని వచ్చే ఐదేళ్లలో దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. దీనివల్ల లగ్జరీ కార్లు సహా పలు మోడళ్లు గణనీయంగా చౌకగా మారే అవకాశముంది. కాబట్టి కొత్త కారు కొనాలని ఆలోచిస్తున్న వారు ఏప్రిల్ వరకు వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

అంతేకాకుండా స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం సుంకం మొదట 75 శాతానికి తగ్గించి, 2035 నాటికి 40 శాతానికి తీసుకువచ్చే ప్రణాళిక ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావం మద్యం మార్కెట్‌పైనా పడనుంది.

ఈ ఒప్పందం ప్రపంచంలోని ఐదవ, ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్‌బ్రిటన్ మధ్య వాణిజ్యాన్ని 2030 నాటికి 56 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. వస్త్రాలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, క్రీడా వస్తువులు, బొమ్మలు వంటి అనేక ఉత్పత్తులపై సున్నా సుంకం అమలు కానుంది.

సీటా అమలుతో భారత వినియోగదారులకు విస్తృతమైన ఎంపికలు, తక్కువ ధరలు లభించే అవకాశముందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా లగ్జరీ వాహనాల కొనుగోలుదారులు కొంతకాలం ఆగితే గణనీయమైన లాభం పొందే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

# జియోకు అంతర్జాతీయ గుర్తింపు.. ప్రపంచ టెక్ దిగ్గజాలతో కూటమి

**వేద న్యూస్ డెస్క్:**




భారతదేశానికి చెందిన రిలయన్స్ జియో మరో కీలక అంతర్జాతీయ విజయాన్ని సాధించింది. ప్రపంచ స్థాయిలో డేటా భద్రత, ఆధునిక సాంకేతికత అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన 'ట్రస్టెడ్ టెక్ అలయన్స్' అనే కూటమిలో జియో సభ్యత్వం పొందింది. ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక సంస్థలతో కలిసి పనిచేసే ఈ కూటమిలో భారత్ తరఫున జియో ఏకైక సంస్థగా నిలవడం విశేషంగా భావిస్తున్నారు. జర్మనీలో జరిగిన భద్రతా సమావేశం సందర్భంగా ఈ కూటమి ఏర్పాటును ప్రకటించారు. డేటా భద్రతను బలోపేతం చేయడం, ఆధునిక సమాచార సాంకేతికతను పారదర్శకంగా అభివృద్ధి చేయడం, భవిష్యత్తు డిజిటల్ వ్యవస్థలకు నమ్మకమైన నియమాలు రూపొందించడం ఈ కూటమి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, ఐదవ తరం మొబైల్ సేవలు, మేఘ సాంకేతిక వ్యవస్థల అభివృద్ధికి సురక్షిత మార్గదర్శకాలను రూపొందించడంపై దృష్టి సారించనున్నారు. ఈ కూటమిలో ప్రపంచంలోని పలు ఖండాలకు చెందిన ప్రముఖ సంస్థలు భాగస్వాములయ్యాయి. వాటిలో గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ తదితర సంస్థలు ఉన్నాయి. కనెక్టివిటీ, మేఘ వేదికలు, సాఫ్ట్‌వేర్, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధిలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ సంస్థలు నిర్ణయించాయి. ప్రపంచవ్యాప్తంగా డేటా దొంగతనం, సైబర్ ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో సురక్షిత సాంకేతిక వ్యవస్థల అవసరం పెరిగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కూటమి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశ్వసనీయ సాంకేతిక ప్రమాణాలు ఏర్పడే అవకాశముందని భావిస్తున్నారు. జియో ఈ కూటమిలో చేరడం ద్వారా భారత డిజిటల్ రంగానికి మరింత గుర్తింపు లభించిందని విశ్లేషకులు చెబుతున్నారు. భవిష్యత్తులో కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, ప్రపంచ సంస్థలతో భాగస్వామ్యం, దేశీయ డిజిటల్ వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడనుందని అంచనా వేస్తున్నారు.

# ఉద్యోగులకు, సామాన్యులకు ఊరట!




**వేద న్యూస్ డెస్క్:**

2026 సంవత్సరానికి సంబంధించిన కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలపై ఫిబ్రవరి 22 వరకు ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన పన్ను ఉపశమనం లభించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముసాయిదాలో ఉద్యోగులకు లభించే వేతనేతర ప్రయోజనాల పరిమితులను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. వాహనాల సామర్థ్యాన్ని ఆధారంగా చేసుకుని మినహాయింపులు కల్పించడం, భోజన భత్యం, బహుమతి కూపన్లు, వడ్డీ లేని రుణాలు, విద్యా భత్యం, వసతి గృహ భత్యం వంటి అంశాల్లో సడలింపులు ఇవ్వాలని సూచించారు. ఇవి ఉద్యోగులపై పడే పన్ను భారాన్ని తగ్గించే అవకాశముంది. అదేవిధంగా బ్యాంకుల్లో నగదు ఉపసంహరణలు, నగదు జమలపై గుర్తింపు సంఖ్య అవసరమైన పరిమితులను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. స్థిరాస్తి కొనుగోలుఅమ్మకాలు, ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు, హోటల్ బిల్లుల విషయంలో కూడా కొన్ని సడలింపులు ఇవ్వాలని ప్రతిపాదించారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 17, 2026

# కంటెంట్ ఉన్న కథలతో దూసుకుపోతున్న కుర్ర భామ


శివాని నాగరం

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో కొత్త అందాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న వేళ యువ నటి శివాని నాగరం తనదైన శైలిలో ముందుకు సాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా గాయని, కూచిపూడి నృత్యకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకుంటూ వరుస అవకాశాలను అందుకుంటోంది. 2024లో విడుదలైన అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టిన శివాని, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించింది. ఆ చిత్రంలో సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి తన సహజమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆసక్తికరంగా, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం ఆడిషన్‌కు వెళ్లిన ఆమె తరువాత ప్రధాన పాత్రకు ఎంపిక కావడం విశేషంగా మారింది. నటనతో పాటు గాయనిగా కూడా శివాని తన ప్రతిభను చూపించింది. ఆరంభం చిత్రంలో “అమాయకంగా” పాటను ఆలపించి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ప్రస్తుతం లిటిల్ హార్ట్స్ చిత్రంలో నటిస్తుండగా, మరోవైపు సుహాస్ హీరోగా నటిస్తున్న హే భగవాన్ చిత్రంలో కూడా కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే శివాని, తరచూ తన ఫొటోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. సహజమైన అందం, నటనా నైపుణ్యంతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంటున్న ఈ తెలుగు అమ్మాయి, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. తెలుగు నటీమణులకు మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్న ఆమె, భవిష్యత్తులో మరింత పెద్ద అవకాశాలు అందుకుంటుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# ‘హే భగవాన్’ పేరు మార్చాలని ఆదేశం

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో ఇటీవలి కాలంలో చిత్రాల పరిశీలన సమస్యలు నిర్మాతలు, దర్శకులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కథా విషయాలకే కాకుండా సినిమా పేర్ల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ తాజాగా హీరో సుహాస్ నటించిన హే భగవాన్ చిత్రానికి పేరు మార్చాలని సూచించింది. దీంతో విడుదలకు ముందు తప్పనిసరి పరిస్థితుల్లో సినిమా పేరును ‘హే బల్వంత్’గా మార్చి చిత్రబృందం కొత్త ప్రకటన విడుదల చేసింది. విడుదలకు కేవలం కొన్ని రోజుల ముందే ఈ మార్పు చోటుచేసుకోవడంతో ప్రచార కార్యక్రమాలపై ప్రభావం పడే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే కుటుంబ ప్రేక్షకులకు అనుకూలమైన ధ్రువీకరణ పొందేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన తర్వాత సినీ అభిమానుల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో వీకే సరేష్, స్రవంతి, అన్నపూర్ణమ్మ ముఖ్య పాత్రల్లో నటించారు. తండ్రీకొడుకుల మధ్య జరిగే సంఘటనల నేపథ్యంలో వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల కాలంలో సినిమా పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడం కొత్త విషయం కాదని, ఇటువంటి పరిణామాలు టాలీవుడ్‌లో పెరుగుతున్నాయని సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు.




# యువరాజ్ సింగ్ రికార్డును బద్దలు కొట్టిన ఇషాన్ కిషన్




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో యువ ఓపెనర్ ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు విజయానికి కీలకంగా మారాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో టీమిండియా 61 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ విజయంతో గ్రూప్‌ఏలో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి సూపర్8 దశకు అర్హత సాధించింది. మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ పాకిస్థాన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చాటాడు. కేవలం 40 బంతుల్లోనే 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి అభిమానులను అలరించాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలోనే దూకుడుగా ఆడుతూ జట్టుకు బలమైన ఆరంభాన్ని అందించాడు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ 27 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసి భారత మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్ పేరిట ఉన్న వేగవంతమైన అర్ధ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. అతని ఇన్నింగ్స్ మ్యాచ్ మలుపు తిప్పడంలో కీలక పాత్ర పోషించగా, అభిమానుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. ఇషాన్ కిషన్ ప్రదర్శనతో భారత బ్యాటింగ్ దళం బలంగా కనిపిస్తుండగా, టోర్నమెంట్‌లో ముందున్న మ్యాచ్‌లకు జట్టులో మరింత ఆత్మవిశ్వాసం పెరిగినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పాక్ కెప్టెన్ కీలక వ్యాఖ్యలు




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో జట్టు ప్రదర్శనపై పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా స్పందించారు. కీలక సందర్భాల్లో ప్రణాళికలు అమలు కాలేదని, ముఖ్యంగా పవర్‌ప్లేలో వరుస వికెట్లు కోల్పోవడం ఓటమికి ప్రధాన కారణమని తెలిపారు. గత ఆరు నెలలుగా అద్భుతంగా రాణిస్తున్న స్పిన్నర్లు ఈ మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయారని, బ్యాటింగ్ విభాగం కూడా నిరాశపరిచిందని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఓటమిపై మాజీ వేగవంతుడు షోయబ్ అక్తర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “మేము మ్యాచ్‌లో ఎక్కడా పోటీలో కనిపించలేదు. ఒకప్పుడు భారత్‌తో సమానంగా పోరాడేవాళ్లం. కానీ ఇప్పుడు వారిని ఓడించడం ఊహించలేని స్థితి” అని వ్యాఖ్యానించారు. అలాగే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహ్సిన్ నఖ్వీపై కూడా అక్తర్ విమర్శలు గుప్పించారు. క్రికెట్‌పై అవగాహనలేని వ్యక్తులు బాధ్యతలు చేపడితే జట్టు ప్రగతి సాధించడం కష్టమని వ్యాఖ్యానించారు. ఇక మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ ప్రదర్శనపై కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మ్యాచ్ గెలిపించలేని ఆటగాళ్లను అతిగా ప్రశంసించడం సరికాదని అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ జట్టు ఓటమిపై అక్కడి క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.ఒకప్పుడు భారత్‌తో సమానంగా పోరాడేవాళ్లం. కానీ ఇప్పుడు వారిని ఓడించడం ఊహించలేని స్థితి” అని వ్యాఖ్యానించారు. అలాగే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహ్సిన్ నఖ్వీపై కూడా అక్తర్ విమర్శలు గుప్పించారు.

# విజయ్ రష్మిక మందన్న పెళ్లి వార్తలపై స్పష్టత

## - నెట్టింట వైరల్ అవుతున్న వెడ్డింగ్ కార్డ్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్‌లో గత కొంత కాలంగా చర్చనీయాంశంగా మారిన హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు మరోసారి జోరందుకున్నాయి. ఇప్పటివరకు తాము మంచి స్నేహితులమే అని చెప్పుకొచ్చిన ఈ జంట నిజంగానే వివాహ అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడు తోంది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఫిబ్రవరి చివరి వారంలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ నగరంలో సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో సాధారణంగా వివాహ వేడుక నిర్వహించాలనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి 26ను ముహూర్తంగా నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వేడుకను గోప్యంగా నిర్వహించాలన్న ప్రయత్నాలు ఉన్నప్పటికీ వివరాలు బయటకు వస్తుండటంతో చర్చ మరింత పెరిగింది. వివాహం సాధారణంగా జరిగినప్పటికీ, అనంతరం హైదరాబాద్‌లో ప్రముఖుల కోసం ప్రత్యేక విందు కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశముందని ప్రచారం సాగుతోంది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వివాహ ఆహ్వాన పత్రం ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. ఆ ఆహ్వాన పత్రం ప్రకారం ఫిబ్రవరి 26న వివాహం జరుగుతుందని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అధికారికంగా స్పందన వచ్చే వరకు ఈ వార్తలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ అంశం సినీ వర్గాలతో పాటు అభిమానుల్లో కూడా పెద్ద చర్చకు దారితీస్తోంది.

# క్యూట్ ఫొటోలతో ఆకట్టుకుంటున్న కృతి శెట్టి

**వేద న్యూస్ డెస్క్:**



ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన అందాల నటి కృతి శెట్టి మరోసారి తన ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. తాజాగా ఆమె పంచుకున్న క్యూట్ ఫొటోలు అభిమా నులను ఆకట్టుకుంటూ విస్తృతంగా పంచు కుంటున్నారు. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న కృతి శెట్టి, తన అందం మరియు నటనతో యువ ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత వచ్చిన శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాలతో వరుస విజయాలు అందుకుని టాలీవుడ్‌లో అదృష్టవంతురాలిగా పేరు తెచ్చుకుంది. అయితే తరువాత వచ్చిన సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం తో తెలుగులో అవకాశాలు కొంత తగ్గాయి. ప్రస్తుతం ఇతర భాషల చిత్రాలపై ఆమె దృష్టి సారించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. చిన్ననాటి నుంచే ప్రకటనల్లో నటించిన కృతి శెట్టి, బాలనటిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి తరువాత హీరోయిన్‌గా ఎదిగింది. సామాజిక మాధ్యమాల్లో తరచూ ఫొటోలు పంచుకుంటూ అభిమానులతో చేరువగా ఉంటోంది. ఇటీవలి ఫొటోల్లో ఆమె క్యూట్ లుక్, స్టైలిష్ హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఈ నటి, తన ఫొటోలతో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తూ వార్తల్లో నిలిచింది.

# అఫ్గానిస్తాన్ ఘన విజయం..



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ జట్టు యూఏఈపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 161 పరుగుల లక్ష్యాన్ని అఫ్గాన్ జట్టు 19.2 ఓవర్లలోనే ఛేదించి ఈ టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో తదుపరి దశ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. సోహైబ్ ఖాన్ అర్ధశతకంతో జట్టును నిలబెట్టగా, అలీషాన్ షరాఫు కీలక పరుగులు చేశాడు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ నాలుగు వికెట్లు తీసి యూఏఈ పరుగుల వేగాన్ని తగ్గించాడు. ముజీబుర్ రెహమాన్ రెండు వికెట్లు, రషీద్ ఖాన్ ఒక వికెట్ సాధించారు. 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ అర్ధశతకంతో బలమైన ఆరంభం ఇచ్చాడు. చివర్లో అజ్మాతుల్లా రెహమాన్ వేగంగా పరుగులు చేసి జట్టును విజయానికి చేర్చాడు. రసూలీ కూడా ఉపయోగకరమైన ఇన్నింగ్స్ ఆడాడు. యూఏఈ బౌలర్లలో జునైద్, అర్ఫాన్ చెరో రెండు వికెట్లు తీసుకోగా, జవాదుల్లా ఒక వికెట్ సాధించాడు. బ్యాట్‌తో కీలక ఇన్నింగ్స్ ఆడటంతో పాటు బంతితో నాలుగు వికెట్లు తీసుకున్న అజ్మాతుల్లా రెహమాన్‌కు మ్యాచ్‌లో ఉత్తమ ఆటగాడు పురస్కారం లభించింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073